క్లుప్తంగా

విగ్రహ ప్రతిష్ఠాపనకు రూ.20వేలు అందజేత



లింగాలఘణపురం: మండలంలోని క్లైం గ్రామంలో ఆంజ నేయస్వామి ఆలయంలో నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపనకు జనగామ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బుషిగంపల ఆంజనేయులు సోమవారం ఆలయ కమిటీ చైర్మన్ జ్ఞాన ఆంజనేయులుకు రూ.20వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో ముమ్మాటి శ్రీనివాసు, రాములు, శివ తదితరులు ఉన్నారు. గ్రామంలో సామాజిక సమస్యలపై స్పందించి పేదలకు సహాయం చేస్తున్న ఆంజనేయులును పలువురు అభినందించారు.

108 అంబులెన్స్ పరిశీలన



బచ్చన్నపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి 108 అంబులెన్స్‌లోని పరికరాలను నల్లగొండ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ నసీరుద్దీన్ జిల్లా మేనేజర్ మండల శ్రీనివాస్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నసీరుద్దీన్ మాట్లాడుతూ ప్రజలు 108 సేవలను వినియోగించుకోవాలని సూచించారు. వేసవిని దృష్ట్యా అంబులెన్స్‌లో ఓఆర్ఎస్, ఐస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈఎంటీ జంగిలి శిరీష, పైలెట్ సురేష్ పాల్గొన్నారు.

యువత సమాజాభివృద్ధికి పాటుపడాలి

● బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎల్లయ్య

జఫర్‌గఢ్: యువత సమాజాభివృద్ధికి పాటుపడాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంచాల ఎల్లయ్య అన్నారు. వడ్డెగూడెంలో తన నివాసంలో యూత్ అసోషియేషన్ రిజిస్ట్రేషన్ కోసం ఆయన రూ. 10 వేలు సభ్యులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తుపదార్థాలకు అలవాటు పడి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. మంచి లక్షణాలతో ముందుకు సాగి తల్లిదండ్రులకు, గ్రామానికి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం ఎల్లయ్యను యూత్ సభ్యులు శాలువతో సత్కరించారు.

భూమిపూజ

బచ్చన్నపేట: మండలంలోని కొన్నె గ్రామంలో తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య విగ్రహ ప్రతిష్ఠాపన కోసం సోమవారం భూమి పూజ నిర్వహించినట్లు కురుమ సంఘం మండల అధ్యక్షుడు జూకంటి కిష్టయ్య తెలిపారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కొమురయ్య అని అన్నారు. విగ్రహ కమిటీ అధ్యక్షుడిగా ఎంటె శ్రీనివాస్, గ్రామ యూత్ అధ్యక్షుడిగా కర్రె మహేష్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. బేజాడి సిద్దులు, నాయకులు పాల్గొన్నారు.

రైతులు దిగులు పడొద్దు



అధికారులతో మాట్లాడుతున్న బాల్‌రెడ్డి

బచ్చన్నపేట: పంటలు ఎండిపోతాయని రైతులు దిగులు పడొద్దని, మండలంలోని గ్రామాలకు గోదావరి జలాలను తీసుకొస్తున్నామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయనిక్కడ మాట్లాడుతూ గ్రామాల్లో భూగర్భ జలాలు తగ్గి బోర్లు, బావుల్లో నీరు తక్కువ ఉన్నందున పంటలు ఎండిపోతాయని రైతులు బాధ పడవద్దని, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సూచనల మేరకు ఎత్తిపోతల పథకం గ్రిడ్ అధికారులతో మాట్లాడి సాగు నీటిని మండలానికి విడుదల చేయించామని చెప్పారు. అలాగే కన్నెబోయిన గూడెం రిజర్వాయర్‌కు కూడా నీటిని పంపింగ్ చేస్తున్నారని, దీంతో కాల్వల ద్వారా మండలంలోని చెరువులను నింపనున్నట్లు తెలిపారు. నల్లనాగుల వెంకటాచారి, జంగిటి విద్యానాథ్, మట్టి బాల్‌రాజు, ఎల్లయ్య, ఇస్మాయిల్, కరుణాకర్, అఖిల్, శ్రీకాంత్, నజీర్ పాల్గొన్నారు.

ఎన్నిక



వెంకటస్వామి

స్టేషన్‌ఘన్‌పూర్: ఈనెల 8,9వ తేదీల్లో ఆన్‌లైన్ వేదికగా మిజార్క్ (అంతర్జాతీయ కతోలిక వ్యవసాయ గ్రామీణ యువతా ఉద్యమం)కు సంబంధించి జరిగిన జనరల్ అసెంబ్లీలో స్టేషన్‌ఘన్‌పూర్ వాసి సింగపురం వెంకటస్వామి కోఆర్డినేటర్‌గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఘన్‌పూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఈ ఉద్యమం ఆసియా, ఆఫ్రికా, యూరోప్, లాటిన్‌అమెరికా నాలుగు ఖండాలలో గ్రామీణ వ్యవసాయ యువతకు తోడ్పాటును అందిస్తుందన్నారు. ఆసియా ఖండం నుంచి మిజార్క్ కోఆర్డినేటర్‌గా ఎన్నిక కావడం సంతోషంగా ఉందన్నారు. కాగా మిజార్క్ గ్లోబల్ అడ్వైజర్ కృష్ణాకర్, ప్రెసిడెంట్ ఫిరోసిటా, కోఆర్డినేటర్లు రుఫీనా, ప్రఫుల్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

మంచు మనోహరం..



జనగామలో వరంగల్-హైదరాబాద్ హైవేపై పొగ మంచు



నర్మెట మండలకేంద్రంలో..

శివరాత్రికి ముందే ఎండలు దంచి కొడుతుంటే.. తెల్లవారు జాము పొగ మంచు అందాలు కనువిందు చేస్తున్నాయి. రోజురోజుకూ పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో సోమవారం జనగామలో వరంగల్-హైదరాబాద్ హైవేపై, నర్మెట మండల కేంద్రంలో ఉదయం 7.30 గంటల వరకు పొగ మంచు కమ్ముకుంది. వాహన చోదకులు ఫ్లడ్ లైట్ల వెలుతురులో ముందుకు కదలగా.. వాకర్లు, ద్విచక్రవాహన చోదకులు, పొలం పనులకు వెళ్లే రైతులు మంచు తెరలను దాటుకుంటూ చల్లని వాతావరణాన్ని ఎంజాయ్ చేశారు.

- జనగామ/నర్మెట

వడిచర్లను సందర్శించిన డీపీఎంలు

● వీఓఏల నుంచి రూ.11లక్షలు రికవరీ

సాక్షి ఎఫెక్ట్..



గ్రామైక్య సంఘాలతో మాట్లాడుతున్న డీపీఎంలు

లింగాలఘణపురం: మండలంలోని వడిచర్ల గ్రామాన్ని సోమవారం ఐకేపీ డీపీఎం (ఫైనాన్స్ అండ్ బ్యాంక్ లింకేజీ) వరలక్ష్మి, మరో డీపీఎం వినతారెడ్డి సందర్శించారు. గ్రామైక్య సంఘాల్లో అక్రమాలకు పాల్పడిన వీఓఏల నుంచి రూ.11లక్షలు రికవరీ చేయించారు. ఈ నెల 9వ తేదీన 'సంఘం నిధులు స్వాహా' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి జిల్లా యంత్రాంగం స్పందించారు. గ్రామైక్య సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి ఆడిట్ నివేదిక ప్రకారం మథర్ థెరిస్సా వీఓలో వీఓఏ నజ్మా రూ.24,71,697లు, అంకిత వీఓల వీఓఏ ప్రభాకర్ రూ.12,89,510లు అక్రమాలకు పాల్పడిట్లుగా గుర్తించారు. ఇందులో వీఓఏ నజ్మా నుంచి రూ.6లక్షలు, ప్రభాకర్ నుంచి రూ.5లక్షలు రికవరీ చేయించారు. మిగిలిన మొత్తం ఈ నెల 20వ తేదీలోగా పూర్తిగా చెల్లించకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీరితో పాటు జనగామ మార్కెట్ వైస్ చైర్మన్ కొల్లూరి శివకుమార్, ఏపీఎం శంకరయ్య, సీసీ వెంకటేశ్వర్లు, వీఓఏల అధ్యక్షకార్యదర్శులు, సంఘ సభ్యులు ఉన్నారు.

పల్లె ప్రకృతివనంలో చెత్తాచెదారం తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న జీపీ సిబ్బంది

రఘునాథపల్లి: మండలంలోని గబ్బెట పల్లె ప్రకృతివనంలో పేరుకు పోయిన చెత్తాచెదారాన్ని గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సోమవారం తొలగించారు. సాక్షిలో సోమవారం 'అధ్వానంగా పల్లె ప్రకృతి వనం' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి నాజియా ఉదయాన్నే పంచాయతీ సిబ్బందితో పల్లెప్రకృతివనంలో ముమ్మరంగా చెత్తాచెదారాన్ని పూర్తిగా తొలగించి శుభ్రం చేయించారు. అనుమతులు లేకుండా పల్లె ప్రకృతి వనంలో పొగాకు పంటను ఎండబెట్టిన రైతుకు నోటీస్ అందజేసి పొగాకును తొలగించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని.. గ్రామస్తులు సహకరించాలని ఆమె కోరారు.

మాట్లాడే హక్కు లేకుండా పోయింది

● సబ్‌జైలు నుంచి విడుదలైన కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి



మనోజ్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

జనగామ: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్వతంత్రంగా మాట్లాడే హక్కు లేకుండా పోయిందని బీఆర్ఎస్ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కోఆర్డినేటర్ కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి అన్నారు. ఐటీ యాక్టు తదితర కేసులకు సంబంధించి 12 రోజులుగా జనగామ సబ్‌జైలులో ఉన్న మనోజ్‌రెడ్డి సోమవారం విడుదలయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సోషల్ మీడియా, ప్రజావేదికల్లో మాట్లాడిన తనలాంటి నాయకులు, కార్యకర్తలను జైల్లో పెడుతున్నారని, అధికారులు చట్టానికి లోబడి పని చేసినప్పుడే విలువలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు తాళ్ల సురేష్‌రెడ్డి, మసిఉర్ రెహమాన్, ముస్త్యాల దయాకర్, జూకంటి శ్రీశైలం, తిరుమల్‌రెడ్డి, పానుగంటి ప్రవీణ్, మామిడాల రాజు, ఉడుగుల నర్సింహులు, గుర్రం నాగరాజు, మంగ రామకృష్ణ తదితరులు మనోజ్‌రెడ్డికి స్వాగతం పలికారు.

'బీఆర్ఎస్ పాలనలోనే అభివృద్ధి'

జనగామ రూరల్: గ్రామాల్లో బీఆర్ఎస్ పాలనలోనే అభివృద్ధి జరిగిందని క్లస్టర్ ఇన్‌చార్జ్ గాడిపల్లి ప్రేమలతరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లి బీఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేయాలన్నారు.

'బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలి'

బచ్చన్నపేట: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలని క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు అన్నారు. మండలంలోని కొన్నె, దబ్బగుంటపల్లి, నక్కవానిగూడెం గ్రామాల్లో నాయకులతో సన్నాహక సమావేశాలు నిర్వహించారు. మసీరుద్దీన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

'పద్మశాలీలకు అవకాశాలు కల్పించాలి'

రఘునాథపల్లి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు జనాభా ప్రాతిపాదికన పద్మశాలీలకు అవకాశాలు కల్పించాలని రాష్ట్ర పద్మశాలీ సంఘం మీడియా కార్యదర్శి చింతకింది కృష్ణమూర్తి కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన కులగుణన సర్వే తప్పులతడకలా ఉందని ఆరోపించారు. కామారెడ్డిలో ప్రకటించిన మాదిరిగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సేవా కార్యక్రమాలకు చేయూత అందించాలి

దేవరుప్పుల: సేవా కార్యక్రమాలకు చేయూత అందించాలని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి పేర్కొన్నారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని పెద్దమదూరు గ్రామ ఉన్నత పాఠశాలలో సోమవారం పదో తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ గైడ్లు, పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందించారు. స్థానికులు పుట్టా హరికిషన్‌రెడ్డి విద్యా సామగ్రి పంపిణీకి చేయూతనందించారు. క

మహాధర్నాకు తరలిన నాయకులు

జనగామ రూరల్: ప్రజా సంఘాల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద తలపెట్టిన మహాధర్నాకు సోమవారం నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బొట్ల శేఖర్ వాహనాలకు జెండా ఊపి ప్రారంభించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం, సందీప్, సుమా, యాకన్న, లవ కుమార్, దేవదానం, ఉప్పలయ్య, హతియ తదితరులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

జనగామ రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం మండలంలోని ఓబల్‌కేశవాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన దాసరి సత్యనారాయణ (70) ఇంటి నుంచి ఇటీవల సైకిల్‌పై వస్తుండగా బచ్చన్నపేట-జనగామ హైవే బస్‌స్టాప్ వద్ద వెనుక నుంచి వచ్చిన జనగామకు చెందిన కారు ఢీ కొట్టింది. దీంతో సత్యనారాయణ సైకిల్ పై నుంచి కిందపడడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తెలు ఉన్నారు. మృతుడి కుమారుడు సంపత్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

'క్రైస్తవులపై దాడులు సరికాదు'

జనగామ రూరల్: సమాజంలో క్రైస్తవులపై దాడులు, వారిని అవమానించడం సరికాదని నేషనల్ క్రిస్టియన్ కౌన్సిలింగ్ రాష్ట్ర ప్రెసిడెంట్ బిషప్ మద్దెల సంజయ్ ఆనంద్, జనరల్ సెక్రెటరీ బక్క ఏలియా అన్నారు. సోమవారం శామీర్‌పేట షాలోమ్ చర్చిలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. క్రైస్తవులపై జరిగే దాడులను ఐకమత్యంతో ఎదుర్కోవాలన్నారు. కాగా, నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్‌గా రాజకుమార్ రోడ్రిక్స్, ప్రధాన కార్యదర్శిగా రమావత్ జోసెఫ్, కోశాధికారిగా ప్రీతి దయాళ్ గారేనిని ఎన్నుకున్నారు.

కొనసాగుతున్న సీపీఎం దీక్షలు

జనగామ రూరల్: పట్టణంలోని హైదరాబాద్ బైపాస్ రోడ్డుపై అండర్‌పాస్ నిర్మించాలని సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం నాటి దీక్షను మహిళా సంఘం జిల్లా నాయకురాలు కొండ వరలక్ష్మి ప్రారంభించి మాట్లాడారు. షాడ సునీత, గణిపాక భిక్షపతి, పసులాది అనిత, గణిపాక ఆండాలు, లక్ష్మి, యాదమ్మ పాల్గొన్నారు.

మూడో రోజుకు చేరిన అభిమన్‌గాంధీ దీక్ష

కొడకండ్ల: స్థానిక సంస్థల ఎన్నికల నిబంధన సెక్షన్ 21(3) 1995 చట్టాన్ని రద్దు చేసి ఇద్దరు పిల్లలకంటే ఎక్కువ సంతానం కలిగిన వారికి పోటీ చేసే అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తూ జీసీసీ మాజీ చైర్మన్ ధరావత్ అభిమన్‌గాంధీనాయక్ సోమవారం మూడో రోజు నిరాహార దీక్షను కొనసాగించారు.

డ్రెయినేజీని సరైన మార్గంలో నిర్మించాలి

జఫర్‌గఢ్: తమ్మడపల్లి (జి) గ్రామంలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్మిస్తున్న సైడ్ డ్రెయినేజీని ప్రజలకు ఇబ్బంది కలుగకుండా సరైన మార్గంలో నిర్మించాలని సీపీఎం గ్రామ కార్యదర్శి వడ్లకొండ సుధాకర్ కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలో ఎంపీడీఓ సుమన్‌కు వినతిపత్రం అందజేశారు.

ధాన్యం చోరీ

చిల్పూరు: మండలంలోని కృష్ణాజీగూడెం గ్రామానికి చెందిన మారపాక వెంకటేశ్వర్లుకు చెందిన ధాన్యం బస్తాలను గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి ఎత్తుకెళ్లారు. బాధితుడి కథనం ప్రకారం.. వ్యవసాయ బావివద్ద వెంకటేశ్వర్లు 12 బస్తాలను నిల్వచేశాడు. సోమవారం ధాన్యం పట్టిద్దామని బావివద్దకు వెళ్లి చూడగా రెండు బస్తాలు మాత్రమే కనిపించాయి. రూ.12వేల నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు. ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరాడు.

పరామర్శ

జఫర్‌గఢ్: ఇటీవల మాతృవియోగం పొందిన మాజీ ఎమ్మెల్యే, బీజేపీ సీనియర్ నాయకుడు అరూరి రమేశ్‌ను ఉప్పుగల్లులో సోమవారం పలువురు పరామర్శించారు. ఈ సందర్భంగా వెంకటమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ రాజ్యసభ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు, వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, మాజీ ఎంపీ చాడ సురేష్‌రెడ్డి, ఎస్ఎస్ఆర్ గ్రూప్స్ చైర్మన్ సంపత్‌రావు తదితరులు ఉన్నారు.

పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ

విద్యారణ్యపురి: జనగామ ప్రాంతానికి చెందిన ఆంజనేయులు, మణెమ్మ దంపతుల కుమారుడు అందించిన విరాళం ద్వారా హనుమకొండ లష్కర్ బజార్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు పరీక్ష ప్యాడ్‌లను హనుమకొండకు చెందిన రామకృష్ణ సోమవారం అందజేశారని హెచ్ఎం ఎం.ఉమ తెలిపారు. 240 మంది విద్యార్థినులకు ఉచితంగా పంపిణీ చేసినట్లు వివరించారు.

విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు



విగ్రహాల శోభాయాత్ర



సీఐ ముసుకు అబ్బయ్యను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

నర్మెట: మండలకేంద్రంలోని కాకతీయు కాలంనాటి పురాతన శివాలయం శిథిలావస్థకు చేరుకోగా గంగం నర్సింహారెడ్డి ఆధ్వర్యంలోని ఆలయ కమిటీ గత రెండేళ్లుగా ఆలయ నిర్మాణ పనులను చేపట్టింది. ఈక్రమంలో మంగళవారం పుణ్యాహవాచనం, గణపతి పూజ, బుధవారం స్థాపిత దేవతా హోమాలు, కుంకుమార్చనలు, పుష్పాది వాసములు, గురువారం శివపంచాయతన సుబ్రహ్మణ్య ఆంజనేయ ధ్వజ నవగ్రహ సహిత కాశీ విశ్వనాథ లింగ ప్రతిష్ఠాపన, మహాన్నదానం చేపట్టనున్నారు. కాగా, నూతన విగ్రహాలు శివలింగం, ప్రాణవట్టం, నవగ్రాహాలు, సుబ్రమణ్య జంటనాగులను వాహనంలో మేళ తాళాలతో సోమవారం మండలకేంద్రంలో శోభాయాత్ర నిర్వహించారు. అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న ప్రతిష్ఠాపనకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి శివయ్యకృపకు పాత్రుకావాలని ఆలయ కమిటీ కోరింది.

ఆలయ అభివృద్ధికి విరాళాలు

శివాలయ అభివృద్ధికి సోమవారం పలువురు దాతలు విరాళాలు అందజేశారు. గంగం నిర్మల పాపిరెడ్డి రూ. 1.50 లక్షలు, కొన్నె అంజలి తిరుపతి రూ.51,116లు, గోపగోని రేణుక శోభన్ బాబు రూ. 50,116లు, మహేశ్వరం స్రవంతి రాధాకృష్ణ రూ. 30,016లు, కొన్నె సింధూజ ప్రసాద్ రూ. 21,016లు, జాంబవ మాదిగ సంఘం రూ. 20,016లు, బైరోజు ఉప్పలయ్య కుమారులు రూ.10,016లు, నర్ర పావని వెంకట రమణారెడ్డి రూ.10,116లు, గాజుల తన్మయి రూ.10,116లు, నేరేళ్ల స్రవంతి సురేందర్ రూ.5,016లు, పోతిరెడ్డి అనిత శ్రీనివాస్ రూ.5,016లు, కొన్నె ఆంజనేయులు దంపతులు రూ.5,016లు, ముదిగొండ శ్రీహరి దంపతులు రూ. 5,016 లు, నర్మెట పెయింటర్స్ 5,016లు సోమవారం కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా సీఐ ముసుకు అబ్బయ్యను సన్మానించారు. కార్యక్రమంలో జంగిటి అంజయ్య, రంగరాజు వెంకట రమణారావు, విద్యాసాగర్ రావు, సల్ల మల్లయ్య, గూడ సేనారెడ్డి, గంగం రఘుపతిరెడ్డి, సంపత్‌రెడ్డి, ప్రజ్ఞాపురం శ్రీధర్, గోపగోని యాదగిరి, శ్రీధర్, గద్దం నర్సయ్య, మల్లయ్య, శివరాత్రి మహేష్, మేకల పెద్దాపురం, వేముల రామచంద్రం, దన్నారపు మురళి, చిర్ర వెంకట్ రెడ్డి, పల్లె ప్రభుదాస్ పాల్గొన్నారు.

ఆటోను ఢీకొట్టిన కారు

● తొమ్మిది మందికి గాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ శివారు కొత్తపల్లి క్రాస్‌రోడ్డు సమీపాన జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న ప్యాసింజర్ ఆటోను గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలోని తొమ్మిది మంది గాయపడ్డారు. కొత్తపల్లికి చెందిన ఎదునూరి వెంకటేశ్వర్లు, రజిత దంపతులు తమ కుమార్తె మౌనికను ఘన్‌పూర్ స్టేషన్‌లో రైలు ఎక్కించేందుకు ఉదయం 5 గంటల సమయంలో గ్రామం నుంచి గట్టు అన్వేష్‌కు చెందిన ఆటోలో వస్తున్నారు. వారితో పాటు వెంకటేశ్వర్లు మనవడు చిన్నారి శ్రీమాన్, మూడు నెలల పాప, పోరండ్ల రజిత, కవిత, భాగ్యమ్మ ఉన్నారు. ఆటోను కొత్తపల్లి క్రాస్‌రోడ్డు సమీప జాతీయ రహదారిపై జనగామ నుంచి హనుమకొండ కు వెళ్తున్న కారు వెనుకనుంచి ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో ఆటో బోల్తా పడి అందులోని డ్రైవర్ అన్వేష్, వెంకటేశ్వర్లుతోపాటు మిగతా ఏడుగురికి గాయాలయ్యాయి. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు 108 అంబులెన్స్ సిబ్బంది చేరుకుని క్షతగాత్రులను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆటోను ఢీకొట్టిన కారును గుర్తించేందుకు సీసీ ఫుటేజీలను పరిశీలించినట్లు సీఐ జి.వేణు తెలిపారు.

సన్మానం



పాలకుర్తి టౌన్: పాలకుర్తి నియోజవర్గం నుంచి పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరిన సందర్భంగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అజారుద్దీన్‌ను ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి కలిసి సన్మానించారు. మొదట బీఆర్ఎస్ నాయుడు, పీఏసీఎస్ చైర్మన్ బిల్లా సుధీర్‌రెడ్డి, రాయపర్తి మాజీ జెడ్పీటీసీ ఆకుల అరుందతిసురేందర్‌రావు, అధిక సంఖ్యలో నాయకులు యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

శ్రీధర్‌గౌడ్‌కు పురస్కారం



పురస్కారం అందుకుంటున్న శ్రీధర్‌గౌడ్

దేవరుప్పుల: షార్ట్ ఫిల్మ్‌లో ఉత్తమ నటన కనబర్చిన మండల ప్రభుత్వ ఉద్యోగి అంబాల శ్రీధర్ గౌడ్‌కు అరుదైన గౌరవం దక్కింది. కూతురు ప్రేమతో.. రూపొందిన లఘు చిత్రంలో తండ్రిగా శ్రీధర్ గౌడ్ ఉత్తమ నటన కనబర్చాడు. సమాజంలో తండ్రి ప్రాధాన్యతను తెలిపేలా అద్భుత నటనతో అలరించాడు. సౌమిత మీడియా, మోర్ట్ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని తెలుగు యూనివర్సిటీలో చేపట్టిన ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఆయనకు టాలెంట్ అవార్డు-2025 పురస్కారాన్ని ప్రదానం చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో శ్రీధర్‌గౌడ్ జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ సందర్భంగా ఆయనను సహచర ఉద్యోగులు, స్థానికులు అభినందించారు.

'ఇసుక అక్రమ రవాణాపై చర్య తీసుకోండి'



కలెక్టరేట్ ఏఓకు ఫిర్యాదు చేస్తున్న ఠాకూర్ గణేష్ సింగ్

జనగామ/రఘునాథపల్లి: రఘునాథపల్లి మండలంలోని వాగుల్లో నుంచి గత మూడేళ్లుగా అధికారుల అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కలెక్టరేట్ ఏఓ మన్సూరీకి సోమవారం మండలానికి చెందిన ఠాకూర్ గణేశ్ సింగ్, బొల్లపల్లి శ్రీనివాస్ వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ ఇసుక తరలింపుతో భూగర్భ జలాలు పడిపోతున్నాయన్నారు. దీంతో యాసంగి సీజన్‌లో సాగు చేసిన పంటలు ఎండిపోయే పరిస్థితి ఉందన్నారు. ఇసుక మాఫియా రాత్రి సమయాల్లో కొన్నాళ్లుగా యథేచ్ఛగా వాగు నుంచి ఇతర ప్రాంతాలకు ఇసుక తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కొంతమంది అధికారులు ఇసుక అక్రమ రవాణాదారులకు సహకరిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు చెప్పారు. ఇసుక మాఫియాపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న హెచ్ఎం సంపత్‌కుమార్



బచ్చన్నపేట: సర్టిఫికెట్‌తో హాసిని

చిల్పూరు: మండలంలోని చిన్నపెండ్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చి సర్టిఫికెట్లు సాధించినట్లు హెచ్ఎం సంపత్‌కుమార్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సంపేటలో జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో పాఠశాల నుంచి మాచర్ల అంకిత, శ్రీవర్ష, జానకి ప్రథమ, ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నట్లు తెలిపారు. సోమవారం పాఠశాలలో హెచ్ఎం, ఉపాధ్యాయులు, కరాటే మాస్టారు, బ్లాక్ బెల్ట్ దాన్ కొయ్యడ రవిలు విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేసి అభినందించారు.

సూర్యనమస్కారంలో హాసిని..

బచ్చన్నపేట: ఇటీవల సిద్దిపేటలో జరిగిన రాష్ట్ర స్థాయి శతసహస్ర సూర్య నమస్కారాల పోటీల్లో ఆరో తరగతి చదువుతున్న మండలంలోని ఆలింపూర్ గ్రామానికి చెందిన హాసిని పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి బహుమతి అందుకుంది. కాగా, సోమవారం గ్రామానికి చెందిన గణేష్ కూతురు హాసినిని మాజీ ఎంపీటీసీ మసూద్, నాయకులు జ్యోతిభాస్కర్, మంతపురి రాములు, కర్ణాకర్‌రెడ్డి, నజీర్ తదితరులు అభినందించారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

● మార్కెట్ చైర్మన్ శివరాజ్ యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న శివరాజ్‌యాదవ్

నర్మెట: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని, ఆ దిశగా కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని జనగామ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బనుక శివరాజ్ యదవ్ అన్నారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు రాజబోయిన లక్ష్మీనారాయణ అధ్యక్షతన మచ్చుపహాడ్, సూర్యబండతండా, ఆగాపేటలలో సోమవారం నిర్వహించిన సన్నాహక సమావేశాలకు హాజరైన ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అమలు చేసిన పథకాలను, అభివృద్ధిని ప్రజలకు వివరించాలని అన్నారు. కార్యక్రమంలో జడల రమేష్, భూక్య శంకర్, కొంరె వెంకన్న , కాసు కనక రాజు, ఇనుగాల రాజిరెడ్డి, చింతకింది లక్ష్మీనారాయణ, బానోత్ బాల్‌సింగ్, గొల్లపల్లి కొంరెల్లి, అంకోజు రాజు, బానోత్ రాములు, నాగపురి బాలరాజు, గుండేటి ప్రసాద్, బావండ్ల యాదగిరి పాల్గొన్నారు.

ఇసుక తరలించకుండా గుంతల ఏర్పాటు

● సీఐ మహేందర్‌రెడ్డి



గుంతలు ఏర్పాటు చేయిస్తున్న పోలీసులు

పాలకుర్తి: మండలంలోని ముత్తారం వాగు నుంచి ఇసుకను అక్రమంగా ట్రాక్టర్లలో తరలించకుండా పొక్లెయినర్‌తో గుంతలు ఏర్పాటు చేసినట్లు సీఐ మహేందర్ రెడ్డి తెలిపారు. సోమవారం సీఐతో పాటు ఎస్సైలు దూలం పవన్ కుమార్, ఎండీ.యాకుబ్ హుస్సేన్ లు పొక్లెయినర్ సాయంతో గుంతలు తవ్వించారు. ముత్తారం వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

రోడ్డుపై పైపుల ద్వారా నీటిని తరలించొద్దు

రోడ్డుపై పైపుల ద్వారా నీటిని తరలించొద్దని సీఐ మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండలంలోని గూడూరు గ్రామ పరిధిలో నీటిని రోడ్డుపై పైపుద్వారా తరలిస్తున్న గ్రామస్తుడితో మాట్లాడి వాటిని తొలగింపజేశారు. రోడ్డుపై పైపుల ద్వారా నీరు తరలిస్తే వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని అన్నారు. రోడ్డుపై పైపులతో నీటిని తరలిస్తే చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.